# డబ్బు

కట్టుకున్న గళ్ళలుంగీ మోకాళ్ళదాకా ఎత్తి బిగించి, పద్మాసనం వేసి ముచ్చటిస్తూ, వర్తమానాన్నీ, భవిష్యత్తునీ ఒక్కలాగే బూతులు తిడుతూ అతను లెక్చరు సాగిస్తున్నాడు, నేనా రైలు పెట్టెక్కే సరికే. అతని చుట్టూ అతని పార్టీ యెనిమిది తొమ్మిది మందున్నారు. జిడ్డు మరకలున్న తన టెరిన్ చొక్కా గుండీ పీకకు తగిలేవరకూ వెనక్కి లాగి ఒక చేత్తో రెండో చెయ్యి రాసుకుంటూ, పదిమందున్నా ఒక్కర్నే ఉద్దేశించి మాట్లాడ్డం అతని అలవాటు. అతని కళ్ళ కింద పొంగు, అతనికి నిషావస్తువులు నిషేధం లేదంటుంది. అతని జుట్టు మూడుగజాలుంది. అతని గెడ్డం మూడ్రోజులుది. అతను మూడు కాలాల గురించీ త్రికాల జ్ఞానిలా ఒక్కలాగ మాట్లాడగలడు. పోయిన యుద్ధంలో మిలటరీ కెళ్ళి పాడై పోయిన వాళ్ళాగో, లేకపోతే నాలుగుసార్లు జైలుకెళ్ళి బాగు పడ్డవాళ్ళాగో వున్నాడు. "అన్నా" అని పలకరిస్తే, "ఏం

బామ్మరిదీ" అని పలికే రకంలా, చూస్తేనే నమ్మకూడద న్నట్టున్నాడు. అతనికి 45 సంవత్సరాలు వుండొచ్చు.

ఈలోగా ఒక కుర్రాడు__అతని పార్టీవాడే__రైలు పెట్టెక్కి అతనికి రెండు బీడీకట్ట లిచ్చేడు.

అతనా కుర్రాడివేపు శపిస్తున్నట్టు చూసి "నీలాటి దాన్నే్రా అవతలీది కెళ్ళి అగ్గిపెట్టె తెమ్మంటే ఆర్నెల్ల కడుపుతో సహా తిరిగొచ్చిందట! లేకపోతే యింతసేపట్రా లంజి కొడుకా!_ ఒక బీడికట్ట తెమ్మంటే ?" అని ఆప్యాయంగా ప్రశ్నించేడు.

కుర్రాడు "ఒకటి కాదు గురూ ! రెండూ" అన్నాడు నవ్వుతూ.

"అన్ని తెలివి తేటుండబట్టేరా లారీ క్లీనరయ్యేవు. ఎక్కడ సస్తే సచ్చేవ్‌గాని 'టీ' లేవ్ ?"

"తెస్తున్నాడు గురూ" అని ఆ కుర్రాడంటూ వుంటే ఒక 'టీ' కుర్రాడు ప్రవేశించి వాళ్ళ పార్టీ అందరికీ 'టీ'లు అందించేడు.

అతను 'టీ' చవిచూసి, చప్పరించి, మిగతా 'టీ' అంతా గడగడా తాగేసి కిటికీలోంచి తుప్పని ఉమ్మి "సిస్సీ ! ఇంతకంటే కిరసనాయలునయం. ఏటీ 'టీ' తాగితే సిన్నప్పుడు తాగిన ఆవుదంకూడా బైటికొచ్చేసేట్టుంది" అంటూ గ్లాసు పక్కవాడి కందించాడు.

అతని మాటలకి అంతా నవ్వేరు. దాంతో అన్యాయం కేసు గెల్చిన ప్లీడర్లా అతను రెచ్చిపోయేడు.

“ఒరే అబ్బాయ్! ఈ ‘టీ’ లో టీయాకు లేసాడా, ఎంగిలాకు లేస్తాడ్రా మీ ప్రొప్రైటరు” అని ‘టీ’ కుర్రాడ్ని తిట్టి “మన బతుకులే యీ టీ నీళ్ళలా ఐపోనాయి గురూ. అంతా సెకెండేండు బతుకులు. ఎక్కడ సూడు, సవకబారు వస్తువులూ, నాసిరకం మనుసులేను.

“ నా సిన్నప్పుడు సూడు; గాంధీగార్లాటోడు ఒక సేటిమెంటిచ్చేడంటే అటు లండన్నుంచిటు లంక్రేవ్వరకూ ఎవ్వుడికి అరదంగాక గడగడ్లాడిపోయీవోరు, తెలీజెప్పమని మళ్ళీ ఆ బాబు కాడికే ఎల్లీవోరు. మళ్ళీ అలాటోడే నెహురూ. ఎనక జెనమలో పూజ తక్కువై మన్లో పుట్టేడుగాని నేకపోతే అమెరికాలో పుట్టాల్సినోడు. ఆ బాబు యిదేశాలెల్తే ఏటి సేసీవోరో ఎరికా? ఎత్తుకొని నెత్తి కెక్కించుకునేవోరు. కాళ్ళుకడిగి నీళ్ళు జల్లుకునేవోరు. ఇంకాడాళ్ళసంగత్సరేసరి. రోడ్ల కెగబడి పోయీవోరుట. ఆ బాబు సిన్నతనంలో ఓపాలి రష్యా ఎల్తే ఏవైందో తెల్సా? మాకు రాజు లేడు. రాజులాగున్నావు మాకు రాజున్సేసుకుంటావని అక్కడోళ్ళు బతిమిలాడ్నా, ఆ బాబొచ్చీసేట్ట. మనిసంటే అతగాడు మడిసి. బంగారం కడ్డీ; ఇనప గుండు.

“అంతెందుకు. నా సిన్నప్పుడు పంచాయితీ పెసిడెంటు పంతుల్లేడూ? చూస్తే పది జనమల పాపాలు పోయీటట్టుండేవోడు. ఇప్పుడూ వున్నారు, పెసిడెంట్లు మనకి! ఏం నాబం? పొట్టకోస్తే మాంసం ముక్కల్తప్ప అచ్చరం ముక్కుండదు. నోరిప్పితే సరేసరి. పుప్పిపల్లూ, కొండనాలుకా తప్ప మాట

పెగలు" అంటూ అతనక్కడితో ఆగి, పక్కనున్న బీడీ కట్ట లోంచి ఎంచొక బీడీ తీసి, దాని రెండోవేపు నోట్లో పెట్టుకొని, శివుడు శంకం వూదినట్లు వూది, మళ్ళీ సన్నవేపు నోట్లో పెట్టుకుని, అంటించి, గట్టిగా దమ్ము లాగాడు. కాని పొగ్గ సమంగా రాలేదు. వెంటనే బీడీ కిటికిలోంచి విసిరేసి "యిన్ని కన్నాలున్న బీడీ ఎపుడు కాల్చన్రా బాబూ! బీడీకి కన్నాలు, బేంకా యినప్పెట్టి క్కన్నాలు. బడ్జట్టుకి కన్నాలు, ఎగిరే ఇమానం యింజన్లో కన్నాలు. అంతా కన్నాల బతుకులై పోనాయంటే నమ్ము.

"నా సిన్నప్పుడు అణా యిచ్చి బీడీకట్టిమ్మంటే అరణా తిరిగిచ్చేసీవోరు. కట్టసించి బీడీ యెలిగిస్తే సారామీదికే పోయేదికాదు మనసు. అరణా యిచ్చి కాఫీ తాగితే యిలా యెలా గుండేదనుకుంటావేటి : కాక్‌టెయిలుండే, కాక్‌టెయిల్లా గుండేదండే నమ్ము. ఇంతకీ ఈతకల్లు, ఎమోనియా సారా తాగే మీకేటి తెలుస్తాదిలే కాక్‌టెయిల్ ల్రుసి!

"నా సిన్నప్పుడు అణా యిచ్చి యీ సొరకాయలుకొని యిలా పొయ్యిమీ దెట్టేసరికి ఎన్నైనపోయీవి. ఇప్పుడో! రూపాయిన్న రిచ్చి యీ సొరకాయలుకొని పొయ్యెక్కిస్తే పొయ్యారిపోద్ది. మొన్నేటైందో ఎరికా? మా యాడది మాంసం వండి అన్నానికూర్చొని, తినకుండా లెగిసిపోనాది. 'ఏటే పిల్లా మాంసం ఒగేసినావ్' అన్నానో లేదో, తాసు పాంలాగ శోకమీద నెగిసి 'ఇది మేకమాంసవా? పూటాకు పైరుముక్క? మా గొప్పమాంసం తెచ్చేవుగాని పల్లకుండు'

అని కళ్ళెర్రజేసింది. మళ్ళ దానికి మాంసవంటే ఎంతిష్టమో తెల్సా? ఎప్పుడోపాలి నన్నే తినేస్తాదేమో ననిపిస్తాది.

"ఇప్పుడంతా డబ్బు గురూ! డబ్బు! ఇలువైన సరుకెవురికీవొద్దు. ఇక మనిసి యిలువ అసలేవొద్దు.

"డబ్బు సూపితే చాలు. ఈదిలో కోతాడుద్ది. ఇంట్లో ఆడది కోతిలాగాడుద్ది. డబ్బుంటేసాలు, కార్లు కొనొచ్చు. మేళ్ళు కట్టొచ్చు. దేవుఁ డెదురు తిరక్కపోతే ఏ సెయిర్మనో, ఎమ్మెల్యో కూడా అయిపోవచ్చు.

"నీకు డబ్బుంటే, నీ కొడుక్కి బంగార బొమ్మలాంటి కోడలు బంగారం సంచుల్లో వస్తాది. నీ కూతుర్ని గొప్పోడెవడో కట్నం నేకుండా పెళ్ళి సేయిస్సుకుంటాడు. నీకొడుకు తిరుడుఫారం ఎందుకు దాళ్నేదనడగరు. నీ కూతురు ముందటేడు అచ్చమ్మాస్పత్రిల్లో ఎందుకు జేరిందనడగరు. నీబామ్మర్ది కర్రి మంత్ర సానిముండ నెందుకు పీక పిసికి సంపేశాడ నడుగరు. నీ వొంశం వద్దు, నీ గుణం అసలేవద్దు. నీ సదువేటనడగరు. నీ డబ్బు కావాలి పెంపుచానికి. ఆకిరికి దొంగ నల్లమందు హోల్సేలు యాపారం నీ దేననికూడా పట్టించుకోరు.

"ఇంతెందుకు. ఈదిలోకెళ్ళు. ఎల్లి, రూపాయలసంచీ గలగల్లాడించు. నీ పక్క నెంతమంది సేరుతారో సూసుకో.

నీ కారమ్ముతా ననొకడొస్తాడు. నీ కిల్లు అమ్ముతానని మరో డొస్తాడు. నీకు వాళ్ళు అమ్ముతానని పదిమంది వొస్తారు. మళ్ళీ ఆళ్ళు సూడ్డానికెలా గుంటారో తెల్సా? రావణాసురిడికింద ఏడుస్తున్న సీతమ్మోర్లలా గుంటారు.

"యింతేందుకు; పదిమందిలో పోలీసోణ్ణి పబ్లిగ్గా సెప్పొట్టు కొట్టి పదిరూపాయలల్నోటు ఆడి సేతిలో పెట్టు. నువ్వూ, ఆడూ ఏదో లెంపకాయలాట లాడుకుంటున్నట్టు నవ్వేసి ఎల్లిపోతాడు.

"తిరపతెల్లు. కాని రైలు దిగక. దిగకుండానే ఎంకటేస్సగుడి గుడేపు తిరిగి డబ్బుసూపి ఏడుకొండలూ ఒక్కబిగిని గంతేసి నీవాళ్ళో వాల్తా డాస్వామి.

"ఈ రోజుల్లో పాకీవోడు మొదలుకొని పరబ్రహ్మం వరకు, డాట్రుబాబు మొదలు డాఫర్నాయూల వోరకూ అందరికీ ఒకటే కావాలి. ఏటనుకున్నావ్ ? డబ్బు !

"నీకు డబ్బు నేకపోతే నువ్వుగాంధీ గార్లాటోడివైనా నీ మొకంమీద ఉమ్మమన్నా ఉమ్మరు. గాంధీగారైనా — మొదట్లో అమాయకం రోజులు గాబట్టి బతగలిగేడు గాని ఈ మాయదార్రోజులొచ్చేక బతకనిచ్చినారా! కాలిసి సంపేసినారుగాని — ఆ బాబుకే యింత డబ్బుండి లంచవిచ్చి పది మంది పోలీసోళ్ళని సుట్టూ ఎట్టుకుంటే సచ్చిపోయీవోడా ? ఆ బాబుని సంపేసీవోరా ?

"ఈ డబ్బుదగ్గర మనిసిని మనిసి నమ్మడు. పెళ్ళాన్ని మొగుడు నమ్మడు. పిల్లని తల్లి నమ్మదు. దేశాన్ని దేశం పొట్టనెట్టేసుకుంటాది. నామాట బద్దమైతే ఈ పాలెల్లి మీ యాడదాన్ని దానమ్మగోరిచ్చిన ఆరెకరాలమ్మేసి నీకు సెకండేండు టాక్సీ కొనిపెట్టమను. అది ఈ రేత్రికే నీ సాపుగుడ్డ ఈదరుగుమీద పారీబోతే నన్ను నంజకొడుకని పిలు. నేను పలుకుతాను. ప్రోనోట్లేకుండా పదొందలు అప్పియ్యమని నీ

తమ్ముణ్ణి ఈపేలే అడుగు. ఆ సాక్కుకి (shock)ఆడు సచ్చనన్నా పోతాడు, నేకపోతే నిన్ను సంపేనన్నా సంపేస్తాడు.

"రెండు పిట్టలు కలిసుంటాయి. రెండు పుల్లు కలుసుంటాయి. కా నిద్దరు మనుషులు కలుసుండరు, డబ్బు సంవందం ఏ. వీ. నేకపోతే.

"డబ్బుదగ్గర న్యాయం నేకపోతే మస్సైపోతావు. నువ్వు లారీ నడుపుతే రిటన్లో లోడేం లేదని నీ ప్రొప్రైట్రుతో అబద్దం సెప్పకు. నువ్వు పంచదారమ్మితే కాయితానికి కాణీ పుచ్చుకోకు. బియ్యం అమ్మితే రాళ్ళు కలపకు. పాలమ్మితే నీళ్ళు కలపకు. యాపారం చేస్తే దొంగలెక్కల్రాయకు. అలాసేసి వచ్చేపడు నీ ఎడ్రసు నీకు తెలుస్తే నాకొచ్చిసెప్పు. నీ కిల్లుండదు. నీ భూమిసావుకారుది. నీ పెళ్ళాం నీ కొల్లదు. నీ కుక్కే నిన్ను కరుస్తాది. నీ వప్పు తీర్చనేక నూతిలో గెంతి నరకానికి పోతావ్ ! పోతే పోతావు డబ్బుతే నెదవ్వి. నా ఏడుపల్లా నుయ్యి మాకు పనికిరాదనే" అని ఆగేడు.

చుట్టూ వున్నవాళ్ళు ఆలోచనల్లో పడ్డవాళ్ళలా మాటాడకుండా వూరుకున్నారు. కాని వాళ్ళలో ఒకడు "అయితే డబ్బుకోసం ఏ పీకన్నా కోసీమంటావన్నమాట" అన్నాడు.

"ఆ తప్పుడుమాట నా కంటగట్టబోకండోరె. నాకు పరమ సయ్యం. అసల్నాకు డబ్బంటె యిష్టవని ఏనంజికొడుకు

నీకో సెప్పింది ? కట్టుకున్నా కొంగకూడదని మాయాడదాన్నో వుంటున్నాగా న్నేకపోతే ఏనాడో సన్నాసినై పోయుండే వోణ్ణి. నా నసలు ఋసిలాంటి మడిసిని.

"ఇంతకీ కళ్ళారా మా డాట్రుబాబుకత సూసేకూడా డబ్బుకి లొంగిపోమంటార్రా బావుల్లారా" అని మూడు నిలువుల నిట్టూర్పు భూమిలోకి గుచ్చి ఆగేడు.

"ఎవుర్డా డాట్రు ? ఏమా కత" అని పంచతంత్రంలో రాజుకొడుకుల్లా చుట్టూ వున్నవాళ్ళు అడిగేరు.

"అయితే సెపా నినుకోండి" అని బీడీకట్టలోంచి ఒక బీడీ ఎంచి, ముట్టించి, బీడీకంపెనీవాడి తల్లీ, పెళ్ళాల శీలం శంకించకుండా కథ ఆరంభించేడు: "నేను మీ ఊర్రాకముందు ఎక్కడుండేవోడ్నో తెల్సా ?...లో. అక్కడో పెద్దాస్పతిర్లో పన్జేసేవోడ్ని. పెద్దాస్పతిరంటే జనరలాస్పతిరనుకునేరు. జనరలాస్పతిరి కెల్తే పేషెంటుకి తోడెల్లినోడు ముందు సస్తాడు. ఆ ఏనక పేషెంటు సస్తాడు. అది కాదు మా యాస్పైతిరి. మాది 'పంకజం నర్సింగ్‌హోమ్'. ఆ వూరి కొండపక్కని సంద్రాని కెదురుగా వుండేది.

"ఆ యాస్పతిరికి తొలీసుట్టు నౌకరీకెల్లి రిచ్చాదిగి, దాని కాంపౌండు గోడ సూసేసరికి గుండె సల్లబడిపోనాది. తొలుస్టట్టు సెంట్రల్ జైలు గోడ సూసినప్పుడలాగే అనిపించిందొరే. లోన కెల్లబోతే గేటుకాడ గూరకావోడు గెంటేబోనాడు. ఆకిరికి నా కాయితా లూసి ఒగ్గేసినాడనుకో.

"గేటుదాటి లోన కెల్లబొయ్యేసరికి కళ్ళు ఝుమ్మ

న్నాయనుకో. అదేదో పెద్ద హోటేలాగో, సినీమా కంపెనీ లాగో వుందిగానీ ఆస్పత్రిల్లాగ నేదు. గేటు దాటగానే ఎకరా లెకరాల పూలతోట; సొర్గంనుండి రతనాలు రాలిపోయినట్టు ఆటి పువ్వులు.

"ఎన్నెలరేత్తిరి పువ్వుల మొక్కల పక్కన సిమ్మెంటు బెంచీమీద కూచుంటే జౌత్కానా నీల్లు సల్లగా తుంపర్లా బడుతూవుంటే నా సాఁవిఁరంగా... సస్తే యీ ఆస్పత్తిరిలోనే సావాలనిపిస్తాది.

"ఇంకాస్పత్తి రెలా గుంటాదనుకుంటావేటి? దాని కోవారంగు గోడలు సూస్తే కొరుక్కు తినెయ్యాలనుంటుంది. దాని నేల్లో నీ ఎదవమొకం సూసుకు గెడ్డం గీసుకోవచ్చు. ఆస్పత్తిరి ఆరంతస్తులు. ఆపరేసనలన్నీ ఆరో అంతస్తులో; మిగతా అంతస్తుల్లో అన్నీ స్పెషల్ వోర్డులు, కిందంతస్తులో ఆఫీసూ, కన్సల్టీషనురూమూ, కంపౌండర్ల గదీనీ.

పేషెంట్ల కిచ్చే గదు నెలా గుంటావేటి? దేనికీ బైటి కెల్లక్కర్లేదు. ప్రతీగదికీ బాత్రుమూ, లెట్రిన్లుంటాయి. ఆ యాస్పత్తిరిలో ఒక హోటేలు, ఒక మందులాసాపు, ఒక మామూలుసాపు, ఒక పుస్తకాలాసాపు, ఒక బీడీకొట్టు అన్నీ వున్నాయి ఒక బయస్కోపూ, బట్టలాసాపూ లేవన్నమాట గాని, నేకపోతే అదో సిన్నూరేననుకో. ఆ యాస్పత్తిరి యింటిపన్ను యిరవై వేలు. కరెండు కరుసు మూడువేలు.

"ఇంకాస్పత్తిరి కొచ్చేవాళ్ళెలాటి వోళ్ళనుకుంటా వేటి?

"పీకలవరకూ లంచాలినీ పెదుద్యోగులు, నీ యమ్మ సస్తూంటే నీ పెళ్ళాంపుస్తె అమ్మించేసి నీకు పదిరూపాయల మందు యిరవై కమ్ముతారే అదిగో అలాటోళ్ళు; యీ ఏల కడితే రేపు కొట్టుకుపోయ్యే బ్రిడ్జిలుకట్టే కంట్రాక్టర్లు; రేత్తిరికి రేత్తిరీ పిప్పళ్లోంచి బ్రాండీ, నల్లమందూ దింపి బంగారమ్మేళ్ళు కడతారే ఆళ్ళు; అంతా అలాంటోళ్ళే ఆ యాస్పత్తిర కొచ్చేది.

"పల్లెటూరి నాయుడి నాలుగో పెళ్ళాం తన సైజు కుర్రాడితో పట్నవాసంలో వుండడానికి లేని జబ్బు సెప్పి మా యాస్పత్తిరిలోనే వుండేది. కలకటేరు పెళ్ళాం కానుపు మాకాడే ఎప్పటికీ సవంత్రాడని సూపరెంటు కూతురు ఆపరీసనూ మాకాడే.

"అంతే కాని నీలాటాల్నలాటిబీదెదవలురా రక్కడికి. అలాటో డెవడైనా మతిసెడి వచ్చేడో, గేటుకాడ గూరకావోడు, గేటుకాడే పీక పిసికి సంపేస్తాడు.

"ఇక మా శాబంటావా ? ఎప్పుడూ ఎవరితోనూ మాట్లాడడు. అచ్చు సినీమా హీరోలాగుంటాడు. పెదాలమీద సిన్న పాపులా అంత సిరునవ్వుతో ఎవురొచ్చినా సరే మూడు మాటల్లో ముగించి పంపేసేవోడు. ఈ బాబు అస్పత్తిరిలో ఆడే మాటలన్నీ ఇంగ్లీసూ తెలుగూ కలుపుకుంటే రోజుకి అరవయ్యుంటాయి. ఆ బాబెప్పుడూ నవ్వడోరే. (ఎప్పుడూ నవ్వని మొగాడ్నీ, ఎప్పుడూ ఏడని ఆడదాన్నీ నమ్మకూడదంటారు.)

"ఆ బాబు కింద ఆడోళ్ళంతో సహా ఆరుగు రసిస్టెంట్లు, మూడు పుంజీల మంతర్సాన్లు; యికనర్సులూ, వార్డుబోయిలు సంగతి సెప్పక్కర్లేనే లేదు" అంటూ అతను మరో బీడీ అంటించడాని కాగేడు.

"యింతకీ నీ కేటుద్యోగం ఆ యాస్పత్రిలో" అని అడ్డు తగిలేడు ఒకడు.

"షాపుర్ ... పేరుకే డ్రైవర్నుగాని డాక్ట్రుబాబుకి సెక్రెట్రీలాటోడ్ననుకో. నాతో సెప్పంది ఆ బాబేపనీ సేసీవోడుకాదు. పొద్దుటేల ఇంటికాడ్నుంచి ఆ బాబు నాస్పత్రికి కారులో తీసుకొస్తూ వుంటే ఆ ఏల ఏ ఆపరేసను సేసాడో, అదెంత కష్టవో, ఆ ముందట్రోజు పేషెంటు ఎందుకు సచ్చిపోయాడో, అన్ని సెప్పేవోడు. అసల్నాకు డాక్ట్రు పన్నేర్పుతానని బతిమిలాడీవోడు. అప్పుడ్నేరుసుకున్నా బాగుండేది. ఇప్పు డీ నారీ డ్రైవరుద్యోగం తప్పిపోయాది.

"ఆ బాబెంత మంచోడనుకుంటావేటి ? రెక్కల్లేవు గాని దేవుళ్ళాటోడు. ఆ బాబు సెయ్యేసీసరికి వొళ్ళు సల్లబడిపోవాల నూటాకు జొరవున్నోడికి. ఆ బాబు సూప్పడేసరికి ఎవరన్నా సరే_ ఆకరకి మన లారీ కంపెనీ పొప్పరైటరు ముండ దురగమ్మలాటిదైనా సరే కనివాలిసిందే.

"ఇంకా బాబు వొయిదె మంటావా ? ఇవరించడం నా తరంకాదు. పేషెంటుకిఆకలేస్తే మందు, ఆకలెయ్యకపోతే మందు, నవ్వొస్తే యిండీషను,. ఏడుపొస్తే యిండీషను. పిల్లలు పుట్టడాని కాపరీసను, పుట్టుక పోడాని కాపరీసను. ఆ బాబు కాడ వొయిద్దెం లేని జబ్బు లేదుపో !

"ఇక మడిసంటావా ? సూస్తే యముడుకూడా యెనబోతు దిగిపోతాడు. సచ్చి ఎదవకూడా సావడం మానేస్తాడు. ఎంతటోడికన్నా ఆ బాబుని సూస్తే హడల్ !

"ఆస్పత్తిరి గేటుకాడ, కేడిలాక్ కారెనకసీట్లోంచి దర్జాగా దిగి, గేటుకాడ గూరకావోడి సలా వందుకోకుండా ఆస్పత్తిరిలో నడిసెల్లిపోయిా పెద్దపుల్ని నువ్వెప్పుడైనా సూసేవా ? అదుగో, అలా సూసింవో రతన్నంతా. ఆస్పత్తిరి కొస్తూవుంటే; ముందురేత్తిరి మూడు పురుళ్ళుపోసిన మంతర్సానిముండకూడా హుషారుగుండేది అతనొచ్చేసరికి.

"ఆ బాబుకి పెళ్ళయిందా ?" ఎవరో అడిగేరు.

"నువ్వల్లకుండోరే. నేకపోతే కీళ్ళిరిసేసి కిటికీలోంచిసిరీగల్ను. సుట్టపీకంతున్నావ్, నీ కెంత తొందర్రా నంజికొడకా ? కత సెప్పడం రాస్సరిగదా, యినడంకూడా రాదు మనెదవలకి.

"పెళ్ళయిందిరా బాబూ, అయింది. మాఅమ్మగోరెలా గుంటారనడగవేం ? బంగారబొమ్మ; రతనాల రాసి; ముట్టుకుంటె మాసిపోద్దేమోనన్నట్టు పింగాణీ బొమ్మలా గుండేది. ఆ యమ్మ దాహం పుచ్చుకుంటే గొంతులో నీల్లు కనిపించాలన్నమాట.

"ఆ యమ్మ కూకున్నసోట తవ్వితే రతనాల గనుండవాలసిందే.

"ఆయమ్మ సెయ్యిపడితే గొడ్డుటావుకూడా సూలు కట్టెయ్యాలి.

"ఆయమ్మ సూప్పడితే నువ్వుకూడా యిమానం డైవరువై పోతావన్నమాట. ఆయమ్మ రాములోరి కాలంలో పుట్టుంటే, సీతూసికి రావణాసురు డెల్లకపోయ్యావోడు.

"అంతందం నా జనమలో సూళ్ళేదురా బాబూ! నేను ఆయమ్మని సూసిన కళ్ళతో మీ దయిద్దరం మొకాలు సూసి, ఆ యమ్మని కూకుండబెట్టి కేడిల్లాక్కారు నడిపిన్నేను, బ్రేకుల్లేని దురగమ్మ లారీ నడుపుకోవాల్సొచ్చిందంటే అంతా నా కరమరా, బాబూ! సారా అమ్ముకున్నాళ్ళో సోడా లమ్ముకున్నట్టున్నాదంటే నమ్ము నా బతుకు.

"నా నారికాడ నౌకరీ కుదురుకుండీసరికే ఆరికి మూడేళ్ళబ్బాయి, ఆ తెరువాత యింకెవరూ లేరు. యింకుండకుండా ఆయమ్మకి ఆపరేసను సేసేరట ఏదో జబ్బు సేస్తే.

"యింకబ్బా యెలాగుండేవోడంటావేటి? మన నరసిమ్మలు బడ్డీకొట్టుకాడ బాలకిష్టుడి బొమ్మలేదూ? అదుగో అలా గుండేవోడు, గిరిజాల్లో! బంతులంత బుగ్గలమద్దిల; ముప్పావించీ మూతి; యిదుగో యింత ముక్కు; పాల తెలుపు; నవ్వితే ముత్తేలవోన పడ్డట్టుండేది. యిదిగో యీ సేతుల్లోనే పెంచేను.

"కుర్రోడు ఎంత సురుకంటావేటి! ఆ రేళ్ళొచ్చేసరికల్లా నా ఒళ్ళో కూకుని కార్నడిపీసీవోడు. సదువుతున్న దొర్ల బళ్ళో పస్టు పెయిజులన్నీ ఆ బాబువే.

"ఆ డాక్ట్రుబాబుకి నానంటే ఎంత దయా! ఎంతభి మానం! ఏం పండుగొచ్చినా... ఆకిరికి పీర్ల పండు గొచ్చినా సరే "యిందరా ఎంకటేశా! యీ పదిరూపాయలూ పట్టుకెళ్ళి పిలల కేదన్నా కొనిపెట్టరా..." అనిచ్చేవోడు. నాకు పిల్ల లేరనీ, మా యాడదాన్నేత మూడు ముళ్ళూ ఏసి న్నేనుగా స్నరికదా, మూడుముళ్ళున్న యీశ్వరుడుకూడా కనిపించ లేడనీ, ఆ బాబు కెన్నిసార్లు సెప్పినా గేపక ముండేది కాదు.

పొద్దు న్నెనిమిది గంటల కాస్పత్తిరి కెల్తే మళ్ళీ రేత్తి రెనిమిది గంటలకే తిరిగి రావడం. యీలోన స్నేహిల్నిండా పనే. నూర్రూపాయల్నోటూ, నూరిన కత్తులూ పట్టుకుందు కే పుట్టే డా బాబు. రేత్తి రింటికొచ్చి తాన్నవాండి అమ్మగారి కెదురుగా కూకుంటే సాలు ఆ బాబు మొహాం లారీ లైట్లా గెలిగిపోయీది. ఆ యమ్మంటే అతని కంతపేమ."

"తాగివోడా మీ డాక్ట్రు?" ఎవరో అడ్డుతగిలేరు.

"ఎవడ్రా నువ్వు? రాములోరి పుట్టిన్రోజుకి, రహీం సాయిబు తద్దినాకి ఏట్రా సంవందం? ఆ బాబు తాగితే నీకేం? తాక్కపోతే నీ కేంరా? ఔన్రా, తాగివోడ్రా! తాగీ వోడు. నీలా బెల్లంసారా మట్టుక్కాదు. ఆ బాబు తాగిబుడ్లు సూస్తేనే, పువ్వులుగుచ్చి టేబిలు మీద ఎట్టుకోవాలనిపి సాది. అంత బావుంటాయి. యింకాటి కరీదు యింటే గుండె పగిలి సస్తావ్. వల్లకుండు. కద సెప్పని.

"యింత మంచోడైనా ఆ బాబు కొకటే లోపం. సెందురికి మచ్చున్నట్టు. బీబోళ్ళంటే గిట్టదు. దరమం అస లెరుగడు. అతన్తోపోలిసి సూస్తే మన దుర్గమ్మ నాలుగు

సేతులున్న దరమ దేవతే నచుకో. ఆ బాబెడుకే ముష్టోడు పడి సస్తూంటే అరాన్సు మందియ్యాడు. అణా దరమ మియ్యాడు.

"ఆ బాబు జనమలో ఏదో రహిస్సెం వుండుంటా దనీ, ఎప్పుడో బీదోళ్ళ సేత కండుజెల్ల తినేసుంటాడనీ అను మాన మేసీది. ఆకిరికి ఎలాగైతేనేం పట్టేసే నా రహిస్సెం.

"ఆ బాబూ, మా యమ్మగోరూ మేనత్త మేనమాం పిల్లలట. సిన్నప్పుడు ఒక టేబిలుకాడ తిని, ఒగ్గదిలో పడు కుండేవోరట. సిన్నప్పట్నుండీ ఒకళ్ళ నొకళ్ళు పెళ్ళి సేసు కుందా రనుకుండీవోరట. ఆళ్ళ పెళ్ళి మొదట్లో ఆళ్ళ పెద్దో ళ్ళకీ యిష్టమేనట.

"కాని మా బాబు పరీచ్చై ప్రేక్టీసు పెట్టేసరికి అత నా స్తంతా అరించిపోయిందట. అతని తండ్రి తనా స్తంతా పందెపు గుర్రాలతోకలకీ, పట్నపుసానుల కోకలకీ ముడెట్టేసి సచ్చిపోనాట్ట, ప్రాక్టీసు పెట్టబోయ్యేసరికి పకీరై పోనాట్ట. మా బాబు, అతగోడి మేనమాంకి ముప్పైలచ్చలాస్తుందిట. 'నాలా ముప్పైలచ్చలాస్తి నేకపోతే పోనాదిగాని, మూడుకాన్లు కరీదు సెయ్యావ్. నీ కెలాగిచ్చేది పిల్లనీ,' అనేసేట్ట మా బాబుతో. అప్పుడు మా బాబు 'మూడేళ్ళు టయమియ్యి. మూళ్ళచ్చలు పట్టుకొస్తే పిల్లనియ్యి. నేకపోతే నీ కూతుర్ని నీ. కిష్టమొచ్చినోడి కిచ్చి పెళ్ళి సేసియ్యి. నేనొచ్చి అచ్చింత లేస్తా,' అని బతిమిలాడి మూడేళ్ళు టయంపొంది కత్తి పట్టి ప్రేక్టీసు పెట్టేట్ట.

మొదట మూణ్ణెల్లూ మూణ్ణాల పరక రాకపోయినా,

తర్వాతందుకుందా బాబు రాశి. ఆ మూడేళ్ళూ ఆ బాబు
నిద్దరేపోనేదుట. అసలన్న వేఁళోంచెయ్యలేదట. లచ్చమీద
లచ్చ లారిజించి పారేసేట్ట. మూడేళ్ళూ అయ్యేసరికి 'ఇదిగో,
మాఁవాఁ! మూళ్ళలచ్చలమీద మరో అరలచ్చ మిగల్చే
ప్పేను. యెప్పు డేటంటావ్?' అని మా యమ్మగోర్ని
పెళ్ళాడేసేట్ట.

"కాని ఆ మూడేళ్ళంగో పట్టుకున్న దన దాహం. మరి
డమ్మకు పట్టుకున్న రకత దాహంలా, మన దురగమ్మ
కూఁతుర్ని పట్టుకొన్న తురకదెయ్యంలా మరొగ్గలేదా బాబుని.
లచ్చిందేవికి తన బతుకు బలిచ్చేసినా డనుకో.

"యిలా గుండగా మూడేళ్ళొ ద్దిప్పటికి. ఆవేల దసరా
దసిఁవిఁ. ఆ బాబు ప్రేక్టి సెట్టెం దాపొద్దే. రేత్తిరి కింట్లో
పెద్దపారిటీ ఏర్పాటు సేసినాడు. ఆ మద్దేన్నం రెండయ్యాక
వరకు పన్జేసి కారెక్కి 'మరి మద్దేన్నం రావద్దు పోసిరా ఎంక
ేశా?' అన్నాడు. నేను కారు లాగించి_కారంటే కారా
రెక్కల్లేవుగాని గాల్లో ఎగిరిపోద్దనుకో. అసల్దానింజను
యినూాన పింజనట_నాకు గేటు దాటించ బొయ్యేసరికి
అడ్డంగా రోడ్డుమీద లారీ వస్సే గేటుదాటి కారాపేసేను.
గూరకావోడు గేటేసేడు. నాను గేరు మారసబోతూవుంటే
పరిగెత్తుకొచ్చే డొరే ఒ జాలడోరు. మని షెలాగున్నా డను
కున్నావేటి? గట్టునబడి మొన్నటిపొద్దు సచ్చిపోయిన నల్ల
సేపలాగున్నాడు. ఆడు నిలబడుంటేనే బతికున్నా డనుకుం
టాంగాని పడుకోబెడితే సచ్చిపోయె డనుకుంటాం.

"ఆడి వొంటికి గోసీ తప్ప ఏట్నేదు."

"కంటిని సీకటితప్ప మరేట్నేదు."

"బాబూ! డాక్టరుబాబూ! రచ్చించు, రచ్చించు, పిల్లోడు సంద్రంలో పడిపోనాడు. అల్లదిగో మావోళ్ళు మోసు కొస్తున్నారు. బాబ్బాయి! యింటి కెళ్ళిపోకు; రచ్చించు," అని కారు కడ్డం పడ్డాడు.

"ఈడి నెత్తిని ఛేడకా సెడితే, అణాపరక్క ఎవ్వడూ కొండు, యిప్పూడింటి కెళ్ళకుండా యీడి కొడుకుని రచ్చిస్తే యీ డేటిస్తాడు? ఏటివ్వగల్డు? యిశ్వాసం ఎవుడి క్కావాలి? పావలాపరకిచ్చి కల్లురొట్టి కొనిపారేస్తే యీడికుక్క సూపుద్ది యీడికంటే ఎక్కువిశ్వాసం," అని మా బాబను కున్నట్టున్నాడు. అసలాబాబేటనుకున్నా నాకు తెలిసి పోద్దిలే.

"ఆ బాబు ఆ జాలారోడ్డాం కోపాలీ, నావొంకోపాలీ సూసి 'దరమాసుపత్తిరికి తీసికెళ్ళం,' డని ఆడ్తో అని, 'పోనీరా' అన్నాడు నాతో, నాను పోనిచ్చినాను.

"మా వెల్లబోయీసరికి 'ఆనందు కలకటేరుకొడుకు పుట్టిన్రోజు పారిటీ' కెళ్ళేడు. 'రండి, రండి,' అంటూ మా యమ్మగోరెదురొచ్చినాది. మా బాబు కారు దిగి 'వణ్ణం దిని బేగి రారా ఎంకటేశా! ఊళ్ళో కెల్దారి, అని నన్ను పంపించీసేడు.

"అరగంటలో వణ్ణం దిని నా నొచ్చీసినాను. అప్పుడి కే సూటేసుకొని తయారై పోనాడా బాబు. కారెక్కి 'జెనర లాస్పత్తిరికి పోనీరా,' అన్నాడు. మాం ఆసుపత్తిరో కెల్ల బొయ్యాసరికి మా కారుజూసి ఒక్కదాటు పరిగెత్తు కొచ్చి

నాడు. యిలా ఎలా పరిగెత్తే డనుకున్నావేటి? అల్లప్పుడు మన సిటీస్వారీసు సివంచలంగోడి బస్సు స్టూడెంటు కుర్రోళ్ళు తగలబెట్టేసి, సివంచలగోడిని కాలిసీనాడికి ఆ డెంటబడితే ఆడు పరిగెత్తినాడే — అప్పుడ్నేను నాయరుకొట్లో టీ తాగుతున్నాన్లే — అదుగో ఆ సివంచలంగోడ్లా పరుగెత్తుకొచ్చినాడా డాట్రు. ఆ బాబూ, మా బాబూ ఏదో యింగ్లీసులో మాటాడుకొని పరిగెత్తినారు. ముందాళ్ళూ, ఎనక నేనూ ఏకబిగిని మూడంతస్తులెక్కేసినాం. తోవలో అగపడ్డ పెతీ డాట్రూ మా యెనకబడ్డాడు.

"మూడో అంతస్తు జేరేక ముందున్న డాట్రు ఒగది తలుపు తీసినాడు. మా బాబు గదిలో కెల్లబోయి గదిలో నేల లేసట్టు నిలబడిపోనాడు. నా నెళ్ళి సూద్దును కదా!

"గది మద్దిల బల్లమీద మా అబ్బాయి బాబు సచ్చి పన్నాడు. నీరు మింగీసేడేమో, కడుపు బంతిలాగై పోనాది. బాబోరే! నే నెజ్జెప్తా వినుకో. నను కన్న తండ్రి నా సేతుల్లోనే పేనా లొగ్గిసినాడు. నన్ను కన్న తల్లిని యిదుగో, ఈ సేతులోనే బూడిద సేసీసేను. అప్పుడు కూడా నా కంత కష్టం కలగలేదంటే నమ్మండోరే.

"వచ్చేవా నాన్నా?" అన్నట్టు అబ్బాయి బాబు కళ్ళు మావేపే సూస్తున్నట్లున్నాయి. కాని చిత్తరవేటంటే మా డాట్రుబాబు ఒక్క మాట మాటాడితే నిన్ను సంపుకుతిన్నంతొట్టు. ఒక్క కన్నీటిసుక్క రాలుస్తే నాను బారికాడికి పుట్టినట్టే.

"అబ్బో! గొప్పోళ్ళు కష్టం సుకం ఒక్కనాట్టే అనుబగించీస్తారు. మన బీదె దవలే — ఎవడన్నా మన గుడిసెలకాడ్డ

కొచ్చి బీడీ కాల్చుకోనాడికి అగ్గిపుల్ల గీస్తే కొంప లంటించేసినట్టు గోల సేసేస్తాం. మన పిల్లోడికి రెండిరోసినా లైతే సచ్చిపోయినట్టే ఏడిసేస్తాం. కాని గొప్పోళ్ళలా కాదులే.

“సుట్టూ వున్న వాళ్ళంతా కుసింత తెలుగులో, ఎక్కువింగ్లీషులో మా బాబుతో ఏటేటో జెప్పేరు. నాకరదవయిందేదంటే_మా అబ్బాయిబాబు ఆస్పత్తిరి కొచ్చిన ఎంటనే పేనం ఒగ్గేసినాడనీ, పావుగంట ముందొస్తే సచ్చిపోయీవోడు కాడని మాత్తరం అరదవైయింది.

“ఆకిరి కెలాగైతేం నాలుగ్గదులు దాటి యీదివారండాలో కొచ్చినాం. ఆ గుంపెనకాల నానున్నాను. ముందు మా బాబున్నాడు.

“వారండా మలుపు దిరగ్గానే మాబాబు దెయ్యాన్ని సూసినట్టాగిపోనాడు. ఏవైందో ఏటోనని నాను ముందు కెళ్ళి సూద్దునుకదా! మా కెదురుగ్గా ఎవుడొచ్చినా డంటావేటి? సచ్చిన నల్ల సేప శవం జాలారోడు. ‘పిల్లా డెలాగున్నాడు బాబూ,’ అంటూ ముందర కొచ్చినాడు.

“ఆడ్ని సూసేసరికి మాబాబు క్కాళ్ళాడక, పక్కనే బెంచీమీద కూలబడిపోనాడు. మోకాళ్ళమీద సేతు లెట్టుకొని, సేతుల్లో మొక మెట్టుకొని ఉండచుట్టుకుపోనాడు. కానప్పుడుమాత్తరం మాబాబు కన్నీటిసుక్కలు ఆబాబు జోళ్ళమీదే పడ్డాయొరే!

“కాని ఆబాబుదగ్గర కెవరూ ఎల్లనేలేదు. కాస్సేపేడిసేస్తేగాని దుఃఖం కడుపు కోసేస్తాదని మావంతా వల్లకుండిపోనాం.

అయిదు నిమిసాలయ్యేక ఒక ముసిల్డాక్టరు మా బాబుకాడ కెల్లి బుజమ్మీద సెయ్యేసి నెగమన్నాడు. కాని మా బాబు నెగనేదు. ఆ ముసిలాడు కుదిపినాడు. కుదిపేసరికి కింకేటుంది: మా బాబు నేలమీది కొరిగిపోనాడు. అంతా కొల్లైపోనాది.

"ఆ బాబ్బతికున్నన్నాళ్ళు బీదోళ్ళ కేసాయం సెయ్యనేదు. ఆళ్ళని సచ్చిన పురుగుల్లా సూసేవోడు ఆళ్ళు కూడా తన నలాగే సూస్తారనుకునేవోడు కావోలు. ఆ జాలారెదవ తన పిల్లోడిపట్ల యింతబిమానం సూపిస్తా డను కొనుండడు.

"బిడ్డ సచ్చిన సాక్కు (shock) నిలబడినాడుగాని బీదోడు సూపిన సత్తేనికి నిలబడ్నేపోనాడు. ఆ సాక్కు సచ్చిపోయి ఆసుపత్రి రొరండాలో దిక్కుమాల్ని సెవంలా పడిపోనాడు." అని అతను ఆగి బీడీ ఆఖరిదమ్ములాగి, కిటికీలోంచి విసిరేసి, తన కథ ఎఫెక్టుకోసం అందర్నీ కలియజూసేడు.

"మీ యమ్మగోరేటైనారు:" ఎవరో అడిగేరు.

"ఏటౌద్ది, కనుకున్నాడు పోనాడు. కట్టుకునోన్నదు పోనాడు. ఆశలగ్గిలోపడి పోనాయి.

ఇంతకీ కంట్రాక్టరు కనకయ్య సస్తే మెకానిక్కు ముత్తుస్వామింగో డున్నాడనుకోడానికి మన దురగమ్మలాటిది గా దొరే మా యమ్మ.

"ఆయమ్మకత మరోపాలెసెబుతాగాని, దిగుదిగు టేసన నొచ్చేసినాది." అంటూ అతను రైలు దిగి పోయేడు.